www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 21 ఏప్రిల్ 2023
5
అన్నమయ్య

లయన్స్ క్లబ్ సేవలు భేష్ : సిఐ

ప్రజాశక్తి-చిన్నమండెం

రాయచోటి లయన్స్‌క్లబ్ సేవలు భేష్ అని సిఐ లింగప్ప, ఎస్ఐ రమేష్ పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాయచోటికి చెందిన సురభి ఐరన్‌మార్ట్ అధినేత బి.ఓబుల్‌రెడ్డి ఆర్థిక సాయంతో చిన్నమండెం పోలీసుస్టేషన్‌కు ట్రాఫిక్ నియమనిబంధనలకు సంబంధించి 60 సూచిక ఫ్లెక్సీలను అందజేశారు. ఈ సందర్భంగా సిఐ, ఎస్ఐ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ వారు ప్రజలకు ఉపయోగపడే ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. మండలంలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ప్రమాద సూచికలకు సంబంధించిన ఫ్లెక్సీలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు లయన్ మహమ్మద్, ఉపాధ్యక్షులు వి.హరిష్‌చంద్ర, నందిని ట్రావెల్స్ వినోద్‌కుమార్‌నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సూచిక ఫ్లెక్సీలను అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

త్వరితగతిన భూసేకరణ పూర్తి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

ఝరికోన, గాలివీడు, రామాపురం, ఎల్ఆర్‌పల్లె సప్లై ఛానల్, లిఫ్ట్ ఇరిగేషన్ సంబంధించి భూ సేకరణ త్వరగా పూర్తిచేయాలని తహశీల్దార్లను కలెక్టర్ గిరీష ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఝరికోన, గాలివీడు, రామాపురం, ఎల్ఆర్‌పల్లె సప్లై ఛానల్, లిఫ్ట్ ఇరిగేషన్ భూ సేకరణ వేగవంతంపై సంబంధిత తహశీల్దార్లు, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సేకరణ ఎంత చేశారు, ఎంత చేయాలి, ఏ స్టేజీలో ఉంది తదితర వివరాలు అడిగి తెలుసుకుని ప్రాధాన్యత క్రమంలో భూసేకరణ ప్రక్రియలను పూర్తిచేయాలని సూచించారు. ప్రతివారం భూ సేకరణలో జరిగిన పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. గాలివీడు లిఫ్ట్ స్కీం సంబంధించి రాయచోటి మండలంలో రెండు గ్రామాలు, గాలివీడు మండలంలో 6 గ్రామాల్లో మొత్తం 39.290 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. ఝరికోన లిఫ్ట్ ఇరిగేషన్ సంబంధించి సంబేపల్లి మండలంలోని 2 గ్రామాల్లో 26.290 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. భూసేకరణలో భాగంగా డిక్లరేషన్, అవార్డు, పొజిషన్ హ్యాండ్ ఓవర్ తదితర ప్రక్రియలను త్వరగా పూర్తి చేయాలన్నారు. లిఫ్ట్ స్కీమ్ రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలంలో మొత్తం 71.323 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. అలాగే సప్లై ఛానల్ సంబంధించి రామాపురం మండలం హసనాపురంలో 6.174 ఎకరాలు, లక్కిరెడ్డిపల్లి మండలంలోని దిన్నెపాడు, బి.ఎర్రగుడి, కుర్నూతల మద్దిరేవుల గ్రామాలలో 35.151 ఎకరాల భూసేకరణ చేయాల్సిందన్నారు. గాలివీడు లిఫ్టి స్కీం సంబంధించి ఈనెల 23 లోగా ఫారం సి ఇవ్వాలన్నారు. మే 15 లోగా అవార్డు కావాలని ఆదేశించారు. ఝరికోన లిఫ్ట్ స్కీంలో సంబేపల్లి మండలంలోని శెట్టిపల్లి, దేవపట్లలో అందరి దగ్గర కచ్చితంగా కాన్సెంట్ తీసుకోవాలన్నారు. ఏప్రిల్ 30లోగా అవార్డు కావాలన్నారు. సమీక్షలో రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, ఇరిగేషన్ జిల్లా అధికారి కృష్ణమూర్తి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి జయరాజ్, కలెక్టరేట్ భూ సేకరణ విభాగం సూపర్డెంట్ మహేశ్వర రెడ్డి, తహశీల్దార్లు పాల్గొన్నారు.

'కార్పొరేట్'కు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం

సిపిఎం-సిపిఐ రాజకీయ ప్రచార భేరిలో నాయకులు

ప్రజాశక్తి-రామాపురం

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న మతోన్మాద మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించి దేశాన్ని కాపాడుకుందామని సిపిఎం, సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. రాజకీయ ప్రచార యాత్రలో భాగంగా మండల కేంద్రంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సదర్భంగా సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు పి.శ్రీనివాసులు, నరసింహులు మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్య రాజ్యాంగం బిజెపి పరిపాలనలో ప్రమాదంలో పడిందని వాపోయారు. అన్నదమ్ములా కలిసిమెలిసి ఉండాల్సిన దేశ ప్రజల మధ్య బిజెపి ఆర్ఎస్ఎస్ కూటమి మత విద్వేషాలను చిచ్చు రాజేస్తుందని వాపోయారు. ప్రజల సంపదగా ఉన్న బ్యాంకులను, ప్రభుత్వ రంగ పరిశ్రమలను, ఓడరేవులని, ఆఖరికి వ్యవసాయం సైతం కార్పొరేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తోందని వాపోయారు. మరింత వేగంగా దేశంలోని మడుగులను, భూములను విద్యుత్ ప్రాజెక్టులను, గనులను కార్పొరేట్ వ్యక్తులకు ఆయన అంబానీ, అదానికి దోచి పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 12 లక్షల కోట్ల కుంభకోణాన్ని హెడెన్ బర్గ్ సంస్థ బయటపెట్టినా దానిపై ఇంతవరకు విచారణ చేయని చేపట్టలేదని వాపోయారు. గ్యాస్, విద్యుత్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ ప్రజలపై అధిక భారాలో మోపుతోందని పేర్కొన్నారు. దీంతో సామాన్యులు జీవించలేని స్థితికి చేరుకున్నారని చెప్పారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకూ ప్రజా సమస్యలను పరిష్కరించకుండా బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్పొరేట్ పెట్టుబడిదారులకు లాభాలు తెచ్చిపెడుతోందని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రామాంజులు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, నాయకులు సిద్దిరాజు, శ్రీనివాసులు, రామాంజులు రామచంద్ర, నాగబసిరెడ్డి, అశోక్ ఆంజనేయులు, రంగారెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు. **వీరబల్లి :** దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు పి.శ్రీనివాసులు, నరసింహులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దుర్మార్గులను నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందని, లేకుంటే భవి ష్యత్తు అంధకారమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతుల సంఘ జిల్లా కార్యదర్శి రామచంద్ర, ప్రజలు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద విధానాలకు ఐక్యంగా పోరాడి బిజెపిని ఇంటికి సాగనం పుదామని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు ప్రచారభేరి లక్కిరెడ్డిపల్లి వైఎస్ఆర్ మూడు రోడ్ల కూడలిలో ప్రసంగించారు. కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బత్తల వెంకట రమణ, వడ్డెర సంఘం నాయకులు చల్లా రెడ్డయ్య పాల్గొన్నారు. **గాలివీడు :** సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచార భేరి కార్యక్రమం బస్టాండ్‌కు చేరుకున్న సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్యం రాజ్యాంగం బిజెపి పరిపాలనలో ప్రమాణంలో పడిందని, అన్నదమ్ముల కలిసిమెలిసి ఉండవలసిన దేశ ప్రజల మధ్య బిజెపి ఆర్ఎస్ఎస్ కూటమి మత విద్వేషాలను చిచ్చు రాజేస్తుందని వాపోయారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు శ్రీనివాసులు, చల్లా రెడ్డయ్య, లక్ష్మిదేవి, మండల కార్యదర్శి భాస్కర్, భోగేశ్వర కుమార్, రత్నమ్మ పాల్గొన్నారు.

రామాపురం : మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

తీరని తాగునీటి కష్టాలు

- జోరందుకున్న నీటి వ్యాపారం
- జిల్లా కేంద్రమైనా కొనాల్సిందే
- అదుపులో లేని ధరలు
- అవస్థల్లో పట్టణ ప్రజలు

రాయచోటి పట్టణంలోని ఓ మినరల్ వాటర్ ప్లాంట్

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లా కేంద్రమైన రాయచోటిలో కొన్నేళ్లుగా ప్రజలు తాగునీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. వేసవికాలం వచ్చిందంటే తాగునీటి కోసం ఇబ్బందులు చెప్పనలివి కావు. డబ్బు పెట్టి నీరు కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. మున్సిపల్ పరిధిలో 34 వార్డులున్నాయి. అనుమతులు లేకుండా మినరల్ వాటర్ ప్లాంట్‌లు దాదాపు 40 ఉన్నాయి. ఇందులో ఏ ఒక్కటికీ అనమతి లేదు. పట్టణంలో 21 వేల గృహాలు, లక్షకు పైగా జనాభా ఉన్నారు. అయినప్పటికీ నేటికీ తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. నీటి సమస్యపై శాశ్వత పరిష్కారం ఆలోచించే ప్రజా ప్రతినిధి కానీ, అధికారులు కానీ లేరు. పట్టణ ప్రజలకు వెలిగల్లు ప్రాజెక్టు నుంచి ఐదు, ఆరు రోజులకువొక్కసారి వదులున్నారు. అదీ ఒక గంట మాత్రమే వదలడంతో అవి చాలక పోవడంతో వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతూ సచివాలయాల వద్ద సంబంధిత అధికారులకు విన్నవించుకుంటున్నారు నిరసన చేపడుతున్నారు. వచ్చే నీటిని గంటపాటు కాకుండా మరికొంత సమయం ఎక్కువగా పేరు వచ్చేలా చూడాలంటూ వేడుకుంటున్నారు. నేతలు మారినా ప్రజల తలరాతలు మాత్రం మారడం లేదు. దాదాపు 30 సంవత్సరాల నుంచి రాయచోటి ప్రాంతంలో తాగునీటి సమస్య ఉంది. పార్టీలు న్నికల ముందు తాగునీటి సమస్యపై హామీలిచ్చి ఓట్లు దండుకుని గద్దెనెక్కిన తరువాత ఆ సమస్యను గాలికి వదిలేస్తున్నాయి. ప్రస్తుతం 20 లీటర్ల క్యాన్ రూ.15, 25 లీటర్ల క్యాన్ రూ.18, అరబిందె రూ.8, కూల్ వాటర్ క్యాన్ రూ.30 చొప్పున జోరుగా నేల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా రాయచోటిలో కొనసాగుతుంది. మినరల్ వాటర్‌ను చిన్నచిన్న వాహనాల్లో స్టీల్ డ్రమ్ములతో ఉంచుకుని వీధుల్లో తిరుగుతూ నీటిని విక్రయిస్తున్నారు. ఉదయం నిద్ర లేచిన వెంటనే తాగునీటి కోసం ప్రజలు ఎదురు చూస్తుంటారు. ఉద్యోగాలకు వెళ్లేవారు, వ్యాపారాలు చేసుకునేవారు, కూలీలు చేసుకునేవారు తప్పని సరిగా నీటిని కొనుగోలు చేసి పనులకు వెళ్లాల్సిన పరిస్థితి రాయచోటి ప్రాంతంలో నెలకొంది. గతంలో రూపాయి ఇచ్చి తాగునీటి ప్యాకెట్లను కొని తాగేవారు. నేడు ప్లాస్టిక్ నిషేధించడంతో రైతులు, వ్యాపారులు బయట ప్రాంతాలనుంచి వచ్చి దాహార్తిని తీర్చుకోవాలంటే రూ.పది పెట్టి తప్పనిసరిగా అర లీటర్లు బాటిల్ కొని తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేసవి వచ్చిందంటే తాగునీటి సమస్య విలయ తాండవం చేస్తుంది. గతంలో తాగునీటి సమస్య ఉన్నప్పుడు స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రజలకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసేవారు. వ్యాపారం వస్తువుగా మారడంతో ఆ ప్రాంతంలోని చాలామంది నీటిని ట్యాంకర్ల ద్వారా తోలుతూ ఆర్థికంగా ఎదుగుతున్నారు.

జిల్లాగా ఏర్పడి ఏడాదైనా..

రాయచోటి జిల్లాగా ఏర్పడి ఏడాది కావస్తున్నా నేటికీ మౌలిక వసతులు లేకపోవడం గమనార్హం. రాయచోటిలో నీటి వ్యాపారం మరింత ఊపందుకుంది. మున్సిపల్ అధికారులు అనుమతులు లేని మినరల్ వాటర్ ప్లాంట్లపై శ్రద్ధతోపకపోవడంలో ఆంతర్యం ఏమిటి అని స్థానికులు అనుకుంటున్నారు. ఇష్టారాజ్యంగా నీటి వ్యాపారం జరుగుతున్నా ఏ ఒక్క అధికారి కూడా ప్లాంట్ వద్దకు వెళ్లి సక్రమంగా మినరల్స్ నీటి శుద్ధి జరుగుతున్నదా లేదా గమనించిన పాపాన పోలేదు. కొందరు ఏకంగా మినరల్ వాటర్ పేరు చెప్పి బోర్ల వద్ద నీటిని నింపుకొని ఆ నీటిని ప్రజలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. అయినప్పటికీ ప్రజలు మినరల్ వాటర్ అని నమ్మి వారిచ్చే నీటిని కొని తాగుతున్నప్పటికీ కొందరు అనారోగ్యాల గురవుతున్నట్లు సమాచారం. కూలీనాలీ చేసుకనే వారు రోజు డబ్బులు పెట్టి తాగునీరు కొనాలంటే ఎంతో ఇబ్బంది పడుతున్నారు. నాయకులకు కానీ, అధికారులు కానీ, ఏ ఒక్కరూ ఆలోచించిన పాపాన పోలేదు. ఇప్పటికైనా తాగునీటి ధరలకు నియంత్రణ చేసి, అనుమతులు లేని వాటర్ ప్లాంట్‌ను తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటి ధరలను నియంత్రించాలి

శుద్ధి చేసిన వాటర్ ప్లాంట్‌లో నీటి ధరలను మున్సిపల్ అధికారులు వెంనే నియంత్రించాలి. వెలిగల్లు నీటి సరఫరా చేయాలి. నిత్యం ఉపయోగించే వెలిగల్లు నీటిని రెండు రోజులకు ఒకసారి వదలాలి.

- ఎం.హయ్యద్ బాషా, స్థానికుడు, కె.రామాపురం, రాయచోటి .

తమ దృష్టికి రాలేదు..

మున్సిపాలిటీలో నేను ఈ మధ్యకాలంలోనే కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నాను. వాటర్ ప్లాంట్ అన్ని పరిశీలించి సక్రమంగా శుద్ధి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటాం. వాటర్ ప్లాంట్ ద్వారా తాగునీటిని అధికరేట్లకు సరఫరా చేస్తున్నారని ప్రజలు ఎవరైనా ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

-గంగా ప్రసాద్, మున్సిపల్ కమిషనర్, రాయచోటి.

నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

ఆరోగ్య కార్యదర్శుల విమర్శలు అర్థరహితం

- జిల్లా ఆస్పత్రి వద్ద నిరసనలో ఆశా కార్యకర్తలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆశా కార్యకర్తలపై అక్కసుతోనే హెల్త్ సెక్రటరీలు సిఐటియు నాయకులపై ఆరోపణలు చేస్తున్నారని ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు విమర్శించారు. గురువారం స్థానిక జిల్లా ఆసుపత్రిలో జరిగిన సమావేశంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు జయమ్మ మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వంపై పోరాడుతున్న ఆశాల ఐక్యతను హెల్త్ సెక్రటరీలు సహించలేక పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. హెల్త్ సెక్రటరీలపై ప్రభుత్వ ఒత్తిడిని ఎదిరించలేక ఆశా వర్కర్లపై పెత్తనం చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని అధికారులను కలవడానికి వెళ్లనీయకుండా హెల్త్ సెక్రటరీలు ఆశా వర్కర్లపై వేధింపులకు పాల్పడేది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. హెల్త్ సెక్రటరీలు ఆశా వర్కర్లపై వేధింపులకు పాల్పుతున్నారా లేదా ఆధారాలతో సహా నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామని ధైర్యం ఉంటే బహిరంగ చర్చకు రావాలని హితవు పలికారు. హెల్త్ సెక్రటరీల సంఘం రాష్ట్ర నాయకులుగా చెప్పుకునే లీలావతమ్మ ఆశా కార్యకర్తను ఉదయం నుండి సాయంత్రం వరకు ఉద్యోగి కాకపోయినా సచివాలయంలో ఉండాలని వేదించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పిహెచ్‌సి నుండి మెడికల్ కిట్ తీసుకొచ్చే భాద్యత ఎవరిది, ఎవరు తెస్తున్నారు చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. చేతనైతే సమస్యలు పరిష్కారానికి ఐక్యంగా ప్రభుత్వం పై పోరాటం చేయాలని, అందుకు ఆశా వర్కర్ల మద్దతు ఉంటుందని తెలిపారు. ఆశాలపై వేధింపుల కోసమే యూనియన్ అంటే సహించేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లాలోని ఆశా కార్యకర్తలు మల్లీశ్వరి, కవిత, శంకరమ్మ, చంద్రకళ, నాగమల్లీశ్వరి, పుణ్యవతి, హాజిరాబాను, విమల పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎల్‌పిఒ లక్ష్మీపతి

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి : డిఎల్‌పిఒ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ప్రతి ఒక్కరి ఆధార్ కార్డ్ అప్‌డేట్ చేసుకోవడం తప్పనిసరని డిఎల్‌డిఒ లక్ష్మీపతి తెలిపారు. గురువారం తంబళ్లపల్లె సచివాలయం తంబళ్లపల్లి, కన్యమడుగు, కొట్టాల, పరసోపు, గుండ్లపల్లి సచివాలయాలను తనిఖీ చేశారు. ఉద్యోగుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయాల వారి సమీక్ష సమావేశం నిర్వహించారు. 0-6 ఏళ్ల పిల్లలకందరికీ ఉచితంగా ఆధార్ కార్డ్ మంజూరు చేయాలన్నారు. 17 ఏళ్లలోపు వారికి కూడా డాక్యుమెంటేషన్ అప్‌డేట్‌తో ఆధార్ మంజూరు చేయాలన్నారు. 2000 ముందు ఆధార్ కార్డు పొందిన ప్రతి ఒక్కరు ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవాలని చేసుకునే విధంగా సచివాలయ ఉద్యోగుల్లో చొరవ చూపాలన్నారు. ఆధార్ అప్‌డేట్ చేసుకోకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధి నష్టపోతుందని తెలిపారు. ఎస్‌డిజి సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎఎన్‌ఎంలు, మహిళా పోలీసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అంగన్వాడీ కేంద్రాలను ఇంజినీరింగ్ అసిస్టెంట్ల పరిధిలో సందర్శించి పిల్లల బర్త్ సర్టిఫికెట్లు ఆధార్ మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. నాడు-నేడు పనులు మండలంలో జరుగుతున్న జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణపు పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపిడిఒ ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

జిల్లాలో పలువురు ఎస్ఐలు బదిలీ

ప్రజాశక్తి - రాయచోటి

అన్నమయ్య జిల్లాలో గురువారం పలువురు ఎస్ఐలు బదిలీలయ్యారు. ఎస్. వినోద్ కుమార్ లక్కిరెడ్డిపల్లె నుంచి పెద్దమండెంకు, ఎస్.ఎం.డి.రఫీ రాయచోటి ట్రాఫిక్‌కు సి.లోకేష్ రెడ్డి మదనపల్లెకు, పి.రామకృష్ణ నిమ్మనపల్లికి, బి.రామకృష్ణ రెడ్డి సుండుపల్లెకు, మల్లికార్జునరెడ్డి చిత్తూరు జిల్లా బంగారుపాలెంకు, వి. నాగేశ్వరరావు రాయల్పాడు, ఫాతిమా రాయచోటి, సి.చంద్రశేఖర్ రామసముద్రానికి, జి. చంద్రమోహన్ సిసిఎస్ రాయచోటికి, సి. మధు రామచంద్రుడు ఎస్‌బి రాయచోటికి, పి.వెంకటేష్ మదనపల్లె యుజికి, డి.రవీంద్రబాబు, పిటిఎంకు, బిందు మాధవి రాయచోటి పిసిఆర్‌కు, పి. కృష్ణమూర్తి వాయల్పాడుకు, కె.శ్రీనివాస రెడ్డి దిశ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఎస్‌పి గంగాధరరావు ఉత్తర్వులు జారీ చేశారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ

పీలేరు: రంజాన్ మాసం సందర్భంగా మొలకలచెరువు సిఐ సాదిక్ అలీ తన కుటుంబ సభ్యులతో కలిసి పేద ముస్లింలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. పీలేరు పట్టణం, పోలీస్ క్వార్టర్స్‌లో పేదలకు రంజాన్ తోఫాను అందజేశారు. రంజాన్ మాసంలో పేదల ఆకలి తీర్చడం మహా పుణ్య కార్యమని తెలిపారు. పీలేరు ఇందిరమ్మ కాలనీకి చెందిన కొంతమంది పేదలకు కూడా ఇతోధిక దానం చేశారు. రంజాన్ మాసంలో పేదల కుటుంబాల్లోనూ ఆనందం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. ఈయన గతంలో పీలేరు అర్బన్ సిఐగా విధులు నిర్వహించే సమయంలోనూ ఇలాంటి సేవ, సహాయ కార్యక్రమాలు ఎన్నో చేశారు. పవిత్రమైన రంజాన్ నెల పురస్కరించుకుని పేద, ధనిక తేడా లేకుండా ఈదుల్ ఫితర్ పండుగను ఆనందోత్సహాల మధ్య జరుపుకోవాలని ఆయన కుటుంబ సభ్యులు ఆశించారు.

పేదలకు నిత్యావసరాలు అందిస్తున్న సిఐ సాథిక్ అలీ కుటుంబ సభ్యులు

ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎంపీ

ప్రజాశక్తి-గుర్రంకొండ

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని టి.పసలవాండ్లపల్లి పంచాయతీలో గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు. గ్రామాలలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని ప్రతి ఇంటా తెలిపారు. గడప గడపకఊ కార్యక్రమంలో అభివృద్ధి పనులకు కావాల్సిన డబ్బులు అక్కడికక్కడే మంజూరు చేయించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నవరత్నాల గురించి వాటి అమలు పనితీరు గురించి ప్రజలకు వివరిస్తూ తిరిగి ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికలలో ఎన్నుకోవాలని ప్రజలకు కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ బోర్డు డైరెక్టర్ హరీష్‌రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు యోగేంద్ర, జడ్‌పిటిసి సమీన్ ముక్తియ, ఆర్‌బికె చైర్మన్ జయచంద్రారెడ్డి, సచివాలయ కన్వీనర్ నాగేంద్ర, మాజీ ఎంపిపి నక్క చంద్రశేఖర్, ఎంపిటిసి కరుణాకర్, రెడ్డమ్మకొండ చైర్మన్ నరసింహారెడ్డి, కార్యకర్తలు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, గ్రామస్తులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులు జ్ఞాన సంపదను పెంచుకోవాలి

ప్రజాశక్తి- గాలివీడు

విద్యార్థులు జ్ఞాన సంపదను పెంచుకోవాలని వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంలోని స్థానిక రవిచంద్ర పాఠశాలలో కాన్వగేషన్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా నూలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి స్రవంతి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ తరగతులు యూకేజీ నుంచి 1వ తరగతి, ఐదవ తరగతి విద్యార్థులు హైస్కూల్ తరగతులకు వెళ్లే క్రమంలో కార్పొరేట్ విద్యాసంస్థల తరహాలో కాన్వగేషన్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బినయ్ ఫ్రాన్సిస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ అందుకుంటున్న విద్యార్థి

చదువుకు పేదరికం అడ్డు కాకూడదు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

చదువుకు పేదరికం అడ్డు కాకూడదని స్థానిక ఆజాద్ ఎడ్యుకేషనల్ అండ్ మైనారిటీస్ వెల్ఫేర్ సొసైటీ తరపున 130 అనాథ విద్యార్థులకు గురువారం స్థానిక ఎంపిపి ఉర్దూ మార్కెట్ స్కూల్‌లో ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యా అతిథులుగా జమియత్ ఉలమా ఏ హింద్ రాష్ట్ర బాధ్యులు మౌలానా ఇందాద్‌ఉల్ల ఖాస్మి సయ్యద్ టూర్స్ ట్రావెల్స్ హజ్ వ ఉమ్రా ప్రోప్రేటర్ హాజీ షేక్ ఇర్షాద్ పాల్గొన్నారు. ఈ సంధ్బంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో చదువు కొనసాగిస్తే ఉన్నత స్థానాల్లో స్థిర పడవచ్చని, అందుకు ఆజాద్ సొసైటీ వారు దాతల సహకారంతో మీ ఉన్నతికి సహకరిస్తారని అన్నారు. ఇలాంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు సొసైటీ తరపున నిర్వహిస్తామన్నారు. సొసైటీ అధ్యక్షులు శాహుల్ హామీద్ మాట్లాడుతూ సొసైటీ ద్వారా అమలు పరుస్తున్న కార్యక్రామాలు దాతలుకు అందిస్తున్న సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర ఉర్దూ టీచర్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులుగా ఎస్‌ఎండి హాషిం ఆజాద్ సొసైటీ సేవలను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సొసైటీ ఉప అధ్యక్షులు మహమ్మద్ అలీ, సొసైటి పూర్వ అధ్యక్షులు, సభ్యుడు మహమ్మద్ ఇలియాస్, సొసైటీ ప్రధాన కార్యదర్శి సిబతుర్ రహిమాన్, ఉపాధ్యాయులు, ఫయాజ్, అసద్, యూసఫ్, విద్యార్థులు వారి తల్లదండ్రులు పాల్గున్నారు.

పుస్తకాలు పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు

'నాడు-నేడు రెండో విడత పనులు వేగవంతం'

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో చేపట్టిన మనబడి-నాడు నేడు రెండో విడత పనులను విద్యా సంవత్సరం ప్రారంభంలోపు పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మనబడి-నాడు నేడు రెండో విడత పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 12 లోపల మనబడి-నాడు నేడు రెండో విడత పాఠశాలలకు సంబంధించి మరుగుదొడ్లు, కిచెన్ షెడ్స్, మేజర్, మైనర్ రిపేర్స్, ఎలక్ట్రీషియన్ పనులు, తదితర పది రకాల కాంపోనెంట్స్ పనులన్నీ పూర్తి చేయాలన్నారు. జిల్లాలో మొత్తం రూ.38.57 కోట్లు రివలింగ్ ఫండ్ హెచ్‌ఎం ఖాతాలలో జమ అయిందని, పనిచేస్తూ ఉంటే ఇంకా రీవలింగ్ ఫండ్ జమవుతుందన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మనబడి-నాడు నేడు పనులను ఫోటో తీయించేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒలను ఆదేశించారు. మండల విద్యాశాఖ అధికారులు తమ పరిధిలో మంజూరైన పాఠశాలలను తనిఖీ చేసి పనులను పర్యవేక్షిస్తూ సిమెంట్ ఇండెంట్ పెట్టారా లేదా తదితర విషయాలపై ఎప్పటికప్పుడు రిపోర్ట్ తయారు చేసి, పనులను వెంటనే మొదలు పెట్టించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాధాన్యత క్రమంలో పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణాలు, మరమ్మతుల పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. చేసిన పనులకు సంబంధించి ఎప్పటికప్పుడూ బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతివారమూ మనబడి -నాడు నేడు పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఎక్కడా అలసత్వం ప్రదర్శించవద్దని తెలిపారు. సమావేశంలో డిఇఒ పురుషోత్తం, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ ప్రసన్న కుమార్, విఎస్ డబ్ల్యూఎస్ ఎఒ మనోహర్ రాజు, సమగ్ర శిక్ష సిఎంఒ కరుణాకర్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

శ్రావణి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న మేడా, ఆకేపాటి

శ్రావణి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండలంలోని ఆకేపాడు పంచాయతీలోని పెద్దూరులో నాలుగు రోజుల క్రితం ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందిన లావణ్య కుటుంబానికి ఎమ్మెల్యే మేడా వెంకట మల్లిఖార్జునరెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి వైసిపి నాయకులు ఆకేపాటి అనిల్ కుమార్ రెడ్డి, మురళి రెడ్డి చేతులు మీదుగా గురువారం రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో నిరుపేదలైన లావణ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేయగలిగామని తెలిపారు. విద్యుత్ కారణంగా ఇలాంటి ప్రమాదాలు మరోసారి చోటు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖకు సూచించారు. కార్యక్రమంలో డిసిసి చైర్మన్ దండు గోపి, వైసిపి మండల అధ్యక్షులు రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ హస్తవరం ఉమామహేశ్వర్ రెడ్డి, గుండ్లూరు సర్పంచ్ మహేశ్వర్‌రెడ్డి, దాసరి పెంచలయ్య, పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, స్వామి త్రిచంద్రనాథ్ పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్ రమణ మృతికి సంతాపం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రైలు కింద పడి మృతి చెందిన ఎల్ఐసి ఏజెంట్ కె.వి.రమణకు రాజంపేట ఎల్ఐసి ఏజెంట్ల అసోసియేషన్ సంతాపం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఎబిఎం మునిరావు మాట్లాడుతూ ఎవరూ ఇటువంటి ఆత్మహత్యలకు పూనుకోవద్దని కోరారు. కార్యక్రమంలో రాజంపేట ఎల్ఐసి అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, కార్యదర్శి ఎం.శంకర్ రెడ్డి, కోశాధికారి సుధాకర్ రాజుతో పాటు పలువురు ఏజంట్లు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి ఎస్ఐ బదిలీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నిమ్మనపల్లి ఎస్ఐ ఫాతిమా బదిలీ అయ్యారు. ఏడాదిన్నరకాలంగా ఇక్కడి పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన ఆమె బదిలీపై రాయచోటి డిసిఆర్‌బి పోలీస్ విభాగానికి బదిలీ అయ్యారు. కొన్ని రోజులుగా ఆమె సెలవుల్లో ఉన్నారు. బదిలీల్లో భాగంగా టి.సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ పి.రామకృష్ణ నిమ్మనపల్లెకు రానున్నారు. ఎస్పీ గంగాధర్‌రావు గురువారం బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు.

విగ్రహ ప్రతిష్టకు ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న అశోక్‌కుమార్

24న శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మదనపల్లిలో ఈ నెల 24వ తేదీన శ్రీకృష్ణ దేవరాయల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి పాలక మండలి సభ్యులు కోకల అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డిని శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఆహ్వానించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని బలిజ సామాజిక వర్గంలో ప్రతి కుటుంబం నుండి సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. అభిమానులు, కార్యకర్తలు, వైసిపి నాయకులు తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పలువురు ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. ప్రజలు మదనపల్లికి వచ్చేందుకు నాయకులందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మదనపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్ జింక వెంకటాచలపతి, నాయకులు కొండా సిద్ధార్థ, అమర్నాథ్, వైశాలి చంద్రశేఖర్‌రెడ్డి, సురేంద్ర, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, కరీం, రామ్మూర్తి, కోటకొండ రెడ్డి కుమార్, వేణుగోపాల్ రెడ్డి, శివారెడ్డి, కోటిరెడ్డి, షాధిక్ జమాల్ బాషా, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

డిఇఒను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆదర్శ మాతృత్వానికి ఆత్మీయ సన్మానం

రాయచోటి: డైట్ కళాశాల రాయచోటిలో అధ్యాపకురాలుగా పనిచేస్తున్న శ్రీదేవి కుమారుడు సన్మోహన్ చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా నియమితులైన సందర్భంగా గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ ఒక ఉపాధ్యాయురాలు కుమారుడు కలెక్టర్ కావడం మనందరికీ గర్వకారణమని చెప్పారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ సన్మోహన్ లాగా ట్రైనీ టీచర్స్, విద్యార్థులు అందరూ తమకున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. అనంతరం డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ శివభాస్కర్ విద్యార్థులు డైట్ అధ్యపకురాలు శ్రీదేవి కుమారుడిని ఆదర్శంగా తీసుకొని ఎదగాలని, రాబోయే డిఎస్‌సిలో మంచి ర్యాంకులు సాధించి ఉత్తమ ఉపాధ్యాయులుగా సేవలు అందించాలని కోరారు. సన్మాన గ్రహీత శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఏదైనా సాధించగలరని తెలియజేశారు. జీవితంలో చదువుకొని బాగా స్థిరపడిలి అని సూచించారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు రెడ్డప్ప రెడ్డి, రియాజ్, జాఫర్, అసదుల్లా, రెడ్డయ్య, నాగరాజు, నాగేశ్వరరావు, ట్రైనీ టీచర్స్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

నందలూరు: కడప-చెన్నై ప్రధాన రహదారిలోని నందలూరు కన్యకచెరువు సమీపంలో వెలసిన శ్రీసాయిబాబా ఆలయంలో అఖిలభారత యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి భారతాల శ్రీధర్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, విశ్రాంత ఉపాధ్యాయులు చక్రాల రామసుబ్బన్న, టిడిపి నాయకులు గొబ్బిళ్ళ సుబ్బరాయుడు, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా శ్రీ సాయిబాబా స్వామి వారికి భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు ఆర్ముగం విశ్వనాథ్, తాటి సుబ్బరాయుడు, ఆయుర్వేద నిపుణులు తుమ్మాది శివ, భక్తులు కవిత, హేమ పెద్ద ఎత్తున పేదలు పాల్గొన్నారు.

అన్నం వడ్డిస్తున్న దాతలు

నిర్దేశిత గడువులోగా లక్ష్యాలు పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాల లక్ష్యాలను నిర్దేశించిన కాల పరిమితిలోగా పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ గిరీష రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డికి వివరించారు. గురువారం జిల్లా కలెక్టర్లు, జేసిలతో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వివిధ అంశాలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఇందులో రెవెన్యూ అంశాలలో రీ సర్వే, జాతీయ రహదారులకు, పర్యాటక ప్రాజెక్టులకు భూసేకరణ, వ్యవసాయం, ఉద్యానవనం అనుబంధ రంగాలు, గృహ నిర్మాణంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లేఅవుట్ల వారీగా మంజూరు చేసిన ఇళ్ల పట్టాలు, గృహ నిర్మాణ ప్రగతి, పంచాయతీ రాజ్ , గ్రామీణ అభివృద్ధి, వేసవి కాలం దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యలు తదితరాలపై జిల్లాల వారీగా కలెక్టర్లతో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే లో భాగంగా మొదటి దశ పూర్తి చేసిన గ్రామాలలో ఒక మాసంలోపు హద్దురాళ్లను తప్పనిసరిగా పాతించాలన్నారు. ఇందుకు కచ్చితమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. జిల్లాకు ఎన్ని హద్దురాళ్లు అవసరం, ఎన్ని వచ్చాయి, ఇంకెన్ని రావాల్సి ఉంది, వచ్చిన వాటిలో ఎన్ని హద్దురాళ్లు పాతారు, ఇంకను పాతవలసినవి ఎన్ని తదితరాలలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే చేసిన భూమి, వెబ్ ల్యాండ్‌లో ఉన్న భూమి వివరాలలో తేడా రాకూడదన్నారు. జిల్లాలోని ప్రాజెక్టులకు ప్రభుత్వ, ప్రయివేట్ భూములు మొత్తంగా 639 హెక్టార్లు అవసరం కాగా, ఇప్పటివరకు 340 హెక్టార్లు సేకరించారని, మిగిలింది త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. 2023ను మిల్లెట్స్ ఆఫ్ ది ఇయర్‌గా ప్రకటించినందున జిల్లాలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలన్నారు. వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం కింద ఆర్‌బికె వారీగా జిల్లాలో ఇప్పటివరకు 144 రైతు గ్రూపులను ఏర్పాటు చేశారని, మిగిలిన చోట కూడా రైతు గ్రూపులను వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. గృహ నిర్మాణంలో భాగంగా లేఅవుట్ వారీగా ఇళ్ల పట్టాల మంజూరు, గృహ నిర్మాణ ప్రగతి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు చెందిన వివిధ అంశాలపై సమీక్షించారు. వేసవికాలం దృష్ట్యా గ్రామాలలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. సమావేశంలో డిఆర్ఒ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

కలకడ :కేకు కట్ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కలకడ

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు 73వ జన్మదిన వేడుకలను గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఎక్కడిక్కడ కేకులు కట్ చేసి ఒకొరికొకరు తినిపుంచుకున్నారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి మల్లారపు రవి ప్రకాష్ నాయుడు, మండల అధ్యక్షులు పొత్తూరి ప్రభాకర్ నాయుడు ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కలకడలో చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేసి రాష్ట్రానికి, ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ విశ్వనాథ నాయుడు, కలకడ టౌన్ ఇన్‌ఛార్జి వై.జిలానిబాషా, మాజీ సర్పంచులు శ్రీనివాసులురెడ్డి, చంద్రమోహన్, విశ్వనాథ, శేఖర్ నాయుడు, మాజీ ఎంపిటిసి వెంకటరత్నం, రవి, కరీముల్లాబాషా, జాఫర్ హుస్సేన్, ఖాజా హుస్సేన్, జిరాక్స్ అల్లి, ఇర్షద్‌బాషా, ఆనందరెడ్డి, ఈశ్వరయ్య, కోటేశ్వర్, త్యాగరాజు పాల్గొన్నారు. **కలికిరి :**స్థానిక అమర్నాథ్‌రెడ్డి భవన్లో మండల అధ్యక్షుఖుఅ నిజాముద్దీన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల టిడిపి ఉపాధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచ్ ప్రతాప్ కుమార్ రెడ్డి, మర్రికుంటపల్లి సర్పంచ్ రెడ్డి రామ్, పీలేరు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు అగస్తీశ్వర్, మండల ఎస్టీ నాయకులు శ్రీనివాస్ వర్మ, రాజంపేట నియోజకవర్గ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు భాస్కర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. **నందలూరు:** టిడిపి మండల అధ్యక్షుడు జంగం శెట్టి సుబ్బయ్య ఆధ్వర్యంలో టిడిపి ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు, ఆర్టీసీ మాజీ రీజినల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు ముఖ్య అతిథులుగా హాజరై స్థానిక బస్టాండ్ కూడలిలో చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. కార్యక్రమంలో మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మోదుగుల పెంచలయ్య, నాయకులు మోడపోతుల రాము, నారపు శెట్టిశివ, తాటి సుబ్బరాయుడు, చామంచి పెంచలయ్య, గంధం గంగాధర్, జ్యోతి శివ, కుర్రామణి, ఉప్పు శెట్టి రెడ్డయ్య, గుండు సురేష్, గౌస్ బేగ్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు వేణుగోపాల్ పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** టిడిపి మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ, తెలుగు యువత మండల అధ్యక్షులు చిన్నబాబు ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టిన రోజును ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి నాయకులు కార్యకర్తలకు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రెడ్డప్పరెడ్డి, మునిరత్న, సుధాకర్‌రావు, మల్లికార్జున, శ్రీనివాసులు, లక్ష్మన్న, మల్లప్ప, విజయ్ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** స్థానిక ముత్తు ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో టిడిపి నాయకులు పెరవళి నవీన్, వంశీశ్రీ నరసింహ, నిరంజన్, మహేష్ రాటకొండ, రాజేష్ రాటకొండ, వినయ్ కుమార్, చైతన్యకుమార్ల ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టిన రోజును ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు సమక్షంలో కేక్ కట్ చేసి ప్లకార్డులు చేతపట్టుకుని హ్యాపీ బర్త్ డే టూ సిబిఎన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం చిన్నారులకు పండ్లు, ఎనర్జీ డ్రింక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కవితా రాణి, పాలనాధికారి డాక్టర్ జివిఎస్ బాబు, సంస్థ నిర్వాహకులు కృష్ణచరణ్ పాల్గొన్నారు. **గుర్రంకొండ:** టిడిపి మండల అధ్యక్షులు నాయని జగదీష్ ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణంలో చంద్రబాబు పుట్టిన రోజును ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మహాత్మరెడ్డి, మాదిరెడ్డమ్మ కొండ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ నౌషాద్ అహ్మద్, మాజీ ఎంపిటిసి ఏజాద్ అహ్మద్, తుమ్మలగుంది రెడ్డప్ప, మురళి, చలపతి, చలమారెడ్డి, తరిగొండ చంద్రబాబు, క్రాంతి కుమార్, సుధాకర్ హరి ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** మాజీ మండల అధ్యక్షుడు తిమ్మిరెడ్డి ఉమాపతిరెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రవిరెడ్డి, మాజీ సర్పంచ్ చెంగ్రాయుడు, ఆర్ఎంపి డాక్టర్ల కార్యదర్శి షఫీ నాయక్, టిడిపి నాయకులు గౌస్ పీర్, అమీర్ పాల్గొన్నారు. **పెద్దమండ్యం:** మండల టిడిపి అధ్యక్షులు జిట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టిన రోజు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, మాజీ జడ్‌పిటిసి, మాజీ ఎంపిటిసిలు పాల్గొన్నారు. **వీరబల్లి :** టిడిపి రెడ్డప్పరెడ్డి స్వగృహంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు భానుగోపాల్ రాజు ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. జన్మదిన వేడుకలు సందర్భంగా వాహనదారులు, బాటసారులు, ప్రజల దాహార్తి కోసం స్థానిక రాజు హోటల్ వద్ద దగ్గర చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు బాలగోపాల్ రాజు, టిడిపి మండల సీనియర్ నాయకులు రెడ్డప్పరెడ్డి, లక్ష్మయ్య నాయుడు, నాగ సుబ్బమ్మ, భాస్కర్ రాజు, వర్ల ఆంజనేయులు, పెద్దివిటి ఆంజనేయులు, బీసీ సెల్ రమేష్, విఆర్‌డిఎస్ సురేంద్రరెడ్డి పాల్గొన్నారు. **రామపురం :** జిల్లా ఉపాధ్యక్షుడు గడికోట భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకుడు గాలివీటి నరేంద్ర కుమార్ రెడ్డి, పట్టాభి రామకృష్ణ, గౌడ్ దిలీప్ కుమార్ యాదవ్, అన్నయ్య బాబు, నాగభూషణ్ రెడ్డి, వాసుదేవరెడ్డి, సహదేవరెడ్డి, బి వెంకటేష్ కుమార్, రమేష్ అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్రంకొండ :కేకు కట్ చేస్తున్న టిడిపి నాయకులు

మసీదులో ప్రార్థనలు చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఇఫ్తార్ విందులో ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కలికిరి

మండల కేంద్రంలోని హేమాచారి కల్యాణ మండపంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరయ్యారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు వైసిపిఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అగా మొహిద్దిన్, ముస్లిం మత గురువులు, వేంపల్లి ఫయాజ్, బావాజీ, వేంపల్లి ఖాదరవల్లి, కొవ్వూరు ఖాదరవల్లి, షకీలా, నూరు మహమ్మద్, సయ్యద్, రిజ్వాన్, రియాజ్, తదితర ముస్లిం సోదరులు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందు స్నేహం, పరస్పర సహాయకారం అనుబంధాన్ని సూచిస్తుందని జనసేన పార్టీ రాయల దక్షిణ కోస్తా పార్లమెంటరీ సమన్వయ కర్త మైఫోర్స్ మహేష్ అన్నారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు నిర్వహించే ముస్లిం మైనారిటీలకు ఎంజీ గ్రాండ్‌లో మైఫోర్స్ మహేష్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్షల అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ రంజాన్ మాసం పవిత్రకు సూచిక అని నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు వుండే ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వడం ఆనవాయితీ అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ముస్లిం మైనారిటీ నాయకులు సోను, అయాజ్, జాఫర్, సద్దాం, అప్సర్, సల్మాన్, పార్టీ ముఖ్య నాయకులు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

మదనపల్లెలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

విదేశాల్లో ఉద్యోగ అవకాశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-రాయచోటి

హౌస్ కీపింగ్, కుకింగ్ శిక్షణతో పాటు గల్ఫ్ దేశాలలో ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమానికి 18 నుండి 45 సంవత్సరాలు లోపు గల మహిళా అభ్యర్థుల నుండి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ దరఖాస్తులు కోరుతోందని డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో కొద్ది మంది మహిళలు ఉపాధి కొరకు నకిలీ ఏజెంట్ల మోసాల వలలో చిక్కుకుని సరైన అర్హతలు పత్రాలు లేకుండా విదేశాలకు వెళ్లి అక్కడి చట్టాలు తెలియక మోసపోయి ఇబ్బందులు పడుతున్న విషయం గమనించిన రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందని తెలిపారు.

నగర పంచాయతీకి మూడు ట్రాక్టర్లు మంజూరు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ అభివృద్ధికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగర పంచాయతీ అభివృద్దే లక్ష్యంగా పారిశుధ్య పనులు కోసం రెండు ట్రాక్టర్లకు నిధులు మంజూరు చేయడం శుభపరిణామన్నారు. బి.కొత్తకోట మేజర్ పంచాయతీ నుండి నగర పంచాయతీగా రూపాంతరం చెందిన తర్వాత ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి సంపూర్ణ సహాయ, సహకారాలు అందిస్తున్నారన్నారు. దీనిపై కమిషనర్ నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ ఎంపీ నగర పంచాయతీ అభివృద్ధి కోసం సంపూర్ణ సహకారం అందిస్తున్నారన్నారు. నగర పంచాయతీలో మెరుగైన పారిశుధ్యం కోసం మూడు ట్రాక్టర్లు మంజూరు చేశారని, అందులో రెండు ట్రాక్టర్ నగర పంచాయతీకి వచ్చాయని, మరొక ట్రాక్టర్ రావాల్సి ఉందని తెలిపారు.

నగర పంచాయతీకి మంజూరైన ట్రాక్టర్లు

రంజాన్ తోఫా అందజేస్తున్న జగన్‌మోహన్‌రాజు

పేదలకు రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని టిడిపి సీనియర్ నాయకులు చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి సమ్మెట శివప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం ముస్లింలకు రంజాన్ తోఫాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ప్రతి రంజాన్ పండుగకు చౌక దుకాణాల ద్వారా ముస్లింలకు రంజాన్ తోఫా అందజేశేవారని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వంలో సంతోషంగా పండుగ జరుపుకునేందుకు కూడా లేకుండా రంజాన్ తోఫా రద్దు చేశారని విచారం వ్యక్తం చేశారు. చంద్రన్న ఆశయాలకు తాను తన శక్తి మేరకు రాజంపేట పట్టణంలో ముస్లింలకు రంజాన్ తోఫా కానుకలను ఆయా మసీదు కమిటీల ద్వారా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. నూనెవారిపల్లె రోడ్డులోని ఆల్-బదర్ మసీదు కమిటీలో అధ్యక్షుడు గండికోట గుల్జార్ భాషతో కలిసి చంద్రన్న తోఫా కానుకలను పంపిణీ చేశారు. జానీ బాషాపురం, జీఎంసీ క్లబ్ మసీద్, రైల్వే స్టేషన్ మసీద్, ఈడిగ పాలెం మసీదు, ఉస్మానగర్ మసీదుల పరిధిలో ఆయా కమిటీల ద్వారా చంద్రన్న రంజాన్ తోఫా కానుకలను అందించారు. మండల పరిధిలోని ఊటుకూరులో టిడిపి మండల ఉపాధ్యక్షులు సతీష్ రాజు ఆధ్వర్యంలో చంద్రన్న రంజాన్ తోఫా కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కల్లుగీత కార్మిక రాష్ట్ర డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య, మాజీ ఎంపిపి లక్ష్మీనారాయణ నాయుడు, మాజీ జడ్‌పిటిసి చలమయ్య యాదవ్, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్, నాయకులు తోట శివశంకర్, శివారెడ్డి, పి.వి.రమణ, సతీష్ రాజు, జివి.సుబ్బరాజు, గాలి సుబ్బయ్య, అంజన్‌రాజు, విజయ్‌కుమార్ నాయుడు, సాంబశివనాయుడు, రామారావు నాయుడు, వెంకటేష్ యాదవ్, గురు నాయుడు, కరీముల్లా పాల్గొన్నారు.

రంజాన్ తోఫా అందజేస్తున్న వెంకటరమణ

గాలివీడు : ప్రతి సంవత్సరమూ రంజాన్‌తోఫా అందజేయడం ఆనవాయితీ అని గోపనపల్లి పంచాయతీ బండమీద నక్కలవలపల్లికి చెందిన మిట్టపల్లె వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం గోపనపల్లె గ్రామంలోని 160 పేద ముస్లిమ్ కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హబీబుల్లా, ఖాజాపీరు, శీలం మురళీ, మనోహర్ నాయుడు, పటాన్ బాబు ఖాన్, షేక్ అరిపుల్లా, ఖాదర్‌వలి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మహిళలు జాగ్రత్తలు పాటించాలని అగ్నిమాపక ఫైర్ ఆఫీసర్ బాల ఉషేనయ్య పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం చివరి రోజున స్థానిక అగ్నిమాపక కేంద్రంలో డ్వాక్రా మహిళలు, విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా ఎదుర్కోవాలో చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట గ్యాస్ లీకైన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి మహిళలకు వివరించారు. అగ్గిపెట్టెలు చిన్నపిల్లలకి ఇవ్వకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. రాత్రి వేళల్లో సిలిండర్ గ్యాస్‌ను రెగ్యులేటర్ తప్పకుండా ఆఫ్ చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళలు, అగ్నిమాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణకు అవగాహనే ఔషధం

ప్రజాశక్తి-పీలేరు

వడదెబ్బ నివారణ పట్ల మనం అవగాహన కలిగి ఉండడమే ఔషధమని హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య తెలిపారు. గురువారం తలుపుల పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి అదేశాల మేరకు పీలేరు పట్టణ సమీపంలోని హుమయూన్ నగర్‌లోని ఇటుకల తయారీ బట్టీలో పనిచేసే వలస కూలీలకు వడదెబ్బ-నివారణా చర్యలు అనే అంశంపై వారికి అవగాహన కల్పించారు. కష్ట జీవులకు ప్రస్తుత పరిస్థితిలో నీరే ప్రధాన ఔషధమని, అధిక ఉష్ణోగ్రతలవల్ల శరీరంలోని నీరు చెమట రూపంలో లవణాలు, సోడియం క్లోరైడ్, పొటాషియం, వ్యక్తి కోల్పోతాడని, ఫలితంగా. కాళ్లు పట్టేయడం, తలనొప్పి, స్థిరంగా ఉండలేకపోవడం, వికారం, వాంతులు, నీరసం, ఆయాసం, గుండె వేగంగా కొట్టుకోవడం మొదలగు మార్పులు ఉంటాయని, ఇది వడదెబ్బకు సంకేతమని చెప్పారు. ఇది ఒక్కో సారి స్పృహ కోల్పోయి ప్రాణాంతకం అవుతుందన్నారు. బాగా నీరు తాగాలని, అదనంగా నిమ్మరసం, కొద్దిగా ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరి నీరు, గ్లూకోస్ నీరు, పండ్ల రసాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ, ఆల్కహాల్, పొగాకు, వాటి ఉత్పత్తులు తీసుకోకుండా తేలిగ్గా జీర్ణమయ్యే ఇంటి తిండికి ప్రాధాన్యతనివ్వాలని, ముక్యంగా పిల్లల ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత వహించాలని కూలీలకు వారి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ వెంకటసుబ్బమ్మ, ఎఎన్ఎం లక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వడదెబ్బపై కూలీలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని బండపల్లె సమీపంలో చిత్తూరు- కర్నూలు40వ జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు... ఖాజీపేట మండల తురుమలదిన్నెకు చెందిన రాజగోపాల్‌రెడ్డి రాయచోటి నుంచి రామాపురానికి బయలుదేరాడు. మండల పరిధిలోని బండ్లపల్లె సమీపంలోకి రాగానే అదే సమయంలో కడప నుంచి రాయచోటి వైపు వెళ్తున్న టాటా ఎసిఇ వాహనం ఎ స్కూటర్‌ను ఢీ కొంది. ప్రమాదంలో స్కూటరిస్టు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న రామాపురం ఎస్ఐ కొండారెడ్డి తన సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.